# సీనియర్ సిటిజన్స్ సేవలు స్ఫూర్తిగా ఉండాలి

- రూ. 15 లక్షలతో కమ్యూనిటీ హాల్
- అభివృద్ధిని చూసి ఆశీర్వదించాలి
- వృద్ధులకు తెలంగాణ సర్కారు అండ
- ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డి



నర్సంపేట: మాట్లాడుతున్న ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డి

నర్సంపేట, అక్టోబర్ 1: సీనియర్ సిటిజన్స్ సేవలు భావితరాలకు స్ఫూర్తిగా ఉండాలని నర్సంపేట ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డి అన్నారు. పట్టణంలోని సీనియర్ సిటిజన్స్ కార్యాలయంలో సీనియర్ సిటిజన్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో అంతర్జాతీయ వయోవృద్ధుల దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా కేక్ కట్ చేసి వయోవృద్ధులకు పంపిణీ చేశారు. అనంతరం జరిగిన సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ సీనియర్ సిటిజన్స్‌ను సమాజానికి గొప్ప ఆస్తిగా భావించాలన్నారు. వృద్ధులు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానన్నారు. సీనియర్ సిటిజన్స్ కోసం రూ. 15 లక్షలతో కమ్యూనిటీ హాల్ నిర్మించామన్నారు. త్వరలోనే ప్రారంభిస్తామని చెప్పారు. నర్సంపేట నియోజకవర్గంలో జరుగుతున్న అభివృద్ధిని చూసి ఆశీర్వదించాలని పెద్ది కోరారు. వైద్యం అవసరమున్న వృద్ధులు నర్సంపేటలోని జిల్లా దవాఖాన, క్రిటికల్ కేర్ సెంటర్, టీ డయాగ్నొస్టిక్ హబ్‌ను వినియోగించుకోవాలని కోరారు. వృద్ధుల సంక్షేమానికి తెలంగాణ ప్రభుత్వం కృషి చేస్తున్నదన్నారు. కార్యక్రమంలో సీనియర్ సిటిజన్స్ అసోసియేషన్ అధ్యక్షుడు నల్లా మనోహర్‌రెడ్డి, గౌరవాధ్యక్షుడు ఎర్ర జగన్మోహన్‌రెడ్డి, లక్ష్మణ్‌బాబు, ఎంవీ రామారావు, గండి లింగయ్యగౌడ్, కోడం ఈశ్వరమూర్తి పాల్గొన్నారు.

### పేదల అభ్యున్నతికి ముఖ్యమంత్రి కృషి

నర్సంపేట/దుగ్గొండి: పేదల అభ్యున్నతికి సీఎం కేసీఆర్ కృషి చేస్తున్నారని ఎమ్మెల్యే పెద్ది అన్నారు. క్యాంపు కార్యాలయంలో పట్టణంలోని 21వ వార్డుకు చెందిన పాలకుర్తి కుమారస్వామికి రూ. 2 లక్షల విలువైన సీఎంఆర్‌ఎఫ్ చెక్కు అందించారు. ప్రజారోగ్యానికి బీఆర్‌ఎస్ సర్కారు పెద్దపీట వేస్తున్నదన్నారు. ఆరోగ్యశ్రీ పథకంలో లేని జబ్బులకు సీఎం రిలీఫ్ ఫండ్ ద్వారా ప్రభుత్వం ఆదుకుంటున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ గుంటి రజినీకిషన్ పాల్గొన్నారు. అలాగే, దుగ్గొండి మండలం దేశాయిపల్లికి చెందిన చంద్రయ్యకు రూ. 2.50 లక్షల ఎల్‌వోసీని క్యాంపు కార్యాలయంలో అందజేశారు. బీఆర్‌ఎస్ ప్రభుత్వం పేదలకు ఉచితంగా కార్పొరేట్ వైద్యం అందిస్తున్నదని పెద్ది తెలిపారు. సీఎం కేసీఆర్‌తోనే ఆరోగ్య తెలంగాణ సాధ్యమన్నారు. కార్యక్రమంలో ఎన్నారై శానబోయిన రాజ్‌కుమార్, ఎంపీటీసీ మోర్తాల రాజు పాల్గొన్నారు. అలాగే, లంబాడీలను ఆర్థికంగా ఆదుకోవాలని కోరుతూ ఎల్‌హెచ్‌పీఎస్ నాయకులు వాసునాయక్, జగన్‌నాయక్ ఎమ్మెల్యే పెద్దిని కలిసి వినతిపత్రం అందజేశారు.

## మట్టెవాడ మహిళలకు వరల్డ్ రికార్డులో చోటు



ప్రశంసాపత్రాలు అందుకుంటున్న మహిళలు

పోచమ్మమైదాన్, అక్టోబర్ 1: మట్టెవాడ ప్రాంతానికి చెందిన వనమాల నాగరాణితోపాటు రాధ వరల్డ్ రికార్డు పారాయణంలో ప్రతిభ కనబర్చారు. హైదరాబాద్ కూకట్‌పల్లిలోని శ్రీవేణుగోపాల స్వామి ఆలయంలో ఆదివారం జరిగిన వరల్డ్ రికార్డు పారాయణంలో వరంగల్ జిల్లా నుంచి పాల్గొని, ఓరుగల్లు భక్తిని, పఠనాశక్తిని నిలిపారు. ఈ సందర్భంగా భగవద్గీతలోని 700 సంస్కృత శ్లోకాలను రెండు గంటల్లో పఠనం చేశారు. కల్చరల్ బుక్ ఆఫ్ రికార్డ్సు, ఫ్యూచర్ కలాం బుక్ ఆఫ్ రికార్డ్సు, యూనివర్సల్ అచ్యువర్ బుక్ ఆఫ్ రికార్డ్సు, భారత్ వరల్డ్ రికార్డులో స్థానం సంపాదించుకున్నారు. ఈ సందర్భంగా గురువయ్యప్పన్ సత్సంగ్ నిర్వాహకులు వీరికి ప్రశంసాపత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా మహిళలను వరంగల్ వేణుగోపాలస్వామి ఆలయానికి చెందిన అర్చకులు అభినందించారు.



ఆర్థిక సాయం అందజేస్తున్న మిత్రులు

## బాధిత కుటుంబానికి మిత్రుల సాయం

ఖానాపురం, అక్టోబర్ 1: ధర్మారావుపేటకు చెందిన వల్లె జగదీశ్ ఇటీవల అనారోగ్యంతో మృతి చెందాడు. 1998-99 బ్యాచ్ టెన్త్ విద్యార్థులు ఆదివారం మిత్రుడి కుటుంబాన్ని పరామర్శించారు. అనంతరం రూ. 1.10 లక్షల ఆర్థిక సాయం అందించి స్నేహభావాన్ని చాటారు. కార్యక్రమంలో నాటి గురువు వీరమళ్ల రాములుతోపాటు గుగులోత్ లక్ష్మణ్‌నాయక్, డెంకన సుధాకర్‌గౌడ్, నవీన్, వల్లభనేని కిరణ్, యుగేంధర్, చైతన్య, మమత, స్వప్న, రాజేశ్, కుమారస్వామి, నరేశ్, రాజేందర్, శోభన్ పాల్గొన్నారు.

## మంత్రి ఎర్రబెల్లిని కలిసిన కర్నె రవీందర్

కరీమాబాద్, అక్టోబర్ 1: రాష్ట్ర పంచాయతీరాజ్ శాఖ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావును బీఆర్‌ఎస్ నాయకుడు, 41వ డివిజన్ శంభునిపేట విశ్వనాథకాలనీ అధ్యక్షుడు కర్నె రవీందర్ మర్యాదపూర్వకంగా కలిశారు. చాంబర్ కామర్స్ అండ్ ఇండస్ట్రీస్ 75 వసంతాలు పూర్తి చేసుకున్న సందర్భంగా వ్యవసాయ పంట ఉత్పత్తులకు గిట్టుబాటు ధర కల్పించేలా చొరవచూపాలని కోరారు. మంత్రి సానుకూలంగా స్పందించినట్లు ఆయన తెలిపారు.

## సింహగర్జనకు తరలిన ముదిరాజ్‌లు

నర్సంపేటరూరల్, అక్టోబర్ 1: పరకాలలో ఆదివారం నిర్వహించిన ముదిరాజ్ సింహగర్జన-చైతన్య ర్యాలీ, బహిరంగ సభకు మండలంలోని అన్ని గ్రామాల నుంచి ముదిరాజ్ కులస్తులు భారీగా తరలివెళ్లారు. కమ్మపల్లి నుంచి మెపా జిల్లా ప్రధాన కార్యదర్శి పెండ్యాల కృష్ణ ఆధ్వర్యంలో వాహనాల్లో సభకు తరలారు. కార్యక్రమంలో ముదిరాజ్ సంఘం గ్రామ అధ్యక్షుడు రాజు, కుల పెద్దలు పెండ్యాల భిక్షపతి, కార్యదర్శి పెండ్యాల రవి, గడ్డం నరేందర్, పెండ్యాల మధు, అల్లె పైడి, పెండ్యాల మల్లేశం, అల్లె నవీన్ పాల్గొన్నారు.

## మహేశ్వరంవాసికి డాక్టరేట్



దేవేందర్‌రెడ్డి

నర్సంపేటరూరల్, అక్టోబర్ 1: మహేశ్వరం గ్రామానికి చెందిన వీరమళ్ల దేవేందర్‌రెడ్డి ఆదివారం డాక్టరేట్ పట్టా అందుకున్నాడు. డాక్టర్ కోమల్‌లత పర్యవేక్షణలో ఆయన గ్లోరియోస సూపర్బ ఎల్, సెల్సాస్ట్రస్ పానిక్యూలేటస్ పరిమాణాత్మక విశ్లేషణపై అధ్యయనం చేశాడు. ఈ సందర్భంగా ఆయన సమర్పించిన సిద్ధాంత గ్రంథానికి గాను లక్నో శహారాన్‌పూర్‌లోని గ్లోకల్ విశ్వవిద్యాలయం నుంచి డాక్టరేట్ పొందాడు. దేవేందర్‌రెడ్డి ప్రస్తుతం కాగజ్‌నగర్‌లోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో వృక్షశాస్త్రం అధ్యాపకుడిగా పని చేస్తున్నాడు. ఈ సందర్భంగా ఆయనను గ్రామస్తులు, ప్రజాప్రతినిధులు అభినందించారు.

## డెంగీతో మహిళ మృతి



హరిణి(ఫైల్)

దుగ్గొండి, సెప్టెంబర్ 1: డెంగీతో మహిళా మృతి చెందిన ఘటన మండలంలోని వెంకటాపురంలో జరిగింది. గ్రామస్తుల కథనం ప్రకారం.. గ్రామానికి చెందిన ముత్యం చారి భార్య హరిణి పది రోజులుగా జ్వరంతో బాధపడుతున్నది. ఆమెకు వరంగల్‌లోని ఓ దవాఖానలో చికిత్స అందించారు. పరిస్థితి విషమించడంతో హైదరాబాద్‌లోని ఓ కార్పొరేట్ దవాఖానకు తరలించారు. ఈ క్రమంలో చికిత్స పొందుతూ హరిణి ఆదివారం మృతి చెందింది. మృతురాలికి భర్తతోపాటు కుమారుడు, కూతురు ఉన్నారు.

## నేడు మేడెపల్లికి ఎమ్మెల్యే పెద్ది

నల్లబెల్లి, అక్టోబర్ 1: మేడెపల్లి, రాంపూర్ గ్రామాల్లో సోమవారం జరుగనున్న పలు అభివృద్ధి కార్యక్రమాలను ప్రారంభించేందుకు ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డి రానున్నట్లు యువజన సంఘం అధ్యక్షుడు మామిడిపెల్లి సంపత్, గౌరవ అధ్యక్షుడు ములుగు సుదర్శన్ తెలిపారు. ఆయా గ్రామాల అంబేద్కర్ యువజన సంఘాల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన అంబేద్కర్ కమ్యూనిటీ హాల్, మహాత్మా జ్యోతీరావు పూలే గ్రంథాలయం ప్రారంభోత్సవానికి ఎమ్మెల్యేతోపాటు జడ్పీ ఫ్లోర్‌లీడర్ పెద్ది స్వప్న ముఖ్య అతిథులుగా హాజరు కానున్నట్లు పేర్కొన్నారు. అలాగే, మేడపల్లి-రాంపూర్ క్లస్టర్ పరిధిలోని రైతులకు నేడు రైతు వేదికలో పంట నష్టపరిహారం చెక్కులు పంపిణీ చేయనున్నట్లు ఎమ్మెల్యే పెద్ది ఒక ప్రకటనలో తెలిపారు.

## విద్యుదాఘాతంతో ఒకరి మృతి

చెన్నారావుపేట, అక్టోబర్ 1: విద్యుదాఘాతంతో ఒకరు మృతి చెందిన ఘటన మండలంలోని బోడ మాణిక్యంతండాలో ఆదివారం జరిగింది. స్థానికుల కథనం ప్రకారం.. తండాకు చెందిన బోడ సురేశ్(32) ఆదివారం సాయంత్రం వ్యవసాయ బావి వద్దకు వెళ్లాడు. ఈ క్రమంలో అతడికి కరెంట్ వైర్లు తాకడంతో షాక్‌కు గురై అక్కడికక్కడే మృతి చెందాడు. అతడికి భార్య సుజాత, కూతురు బిందు ఉన్నారు. ఈ విషయమై ఎస్సై తోట మహేందర్‌ను వివరణ కోరగా ఫిర్యాదు అందిన తర్వాత కేసు నమోదు చేస్తామని తెలిపారు.

## 'ఆర్యవైశ్య కార్పొరేషన్ సాధనే లక్ష్యం'

నల్లబెల్లి, అక్టోబర్ 1: ఆర్యవైశ్య కార్పొరేషన్ సాధనే లక్ష్యమని ఆర్యవైశ్య మహాసభ జిల్లా అధ్యక్షుడు, బీఆర్‌ఎస్ సీనియర్ నాయకుడు గందె శ్రీనివాస్‌గుప్తా అన్నారు. హైదరాబాద్‌లో జరిగిన గర్జన సభకు మండలం నుంచి ఆదివారం ఆర్యవైశ్యులు బస్సులో తరలివెళ్లారు. గర్జనకు తరలిన వారిలో మండలాధ్యక్షుడు నీలా వెంకటేశ్వర్లు, నీలా శ్రీనివాస్, గంగిశెట్టి నాగభూషణ్, మురికి మనోహర్, రవీందర్, వీ పూర్ణచందర్, శివనాత్రి శ్రీనివాస్, శివప్రసాద్, శివకుమార్, వెంకటేశ్, శ్రీకాంత్, పాగరాజు, వీరయ్య, అక్షిత్, అనుదీప్, రాజయ్య, నవీన్, భవనేశ్ పాల్గొన్నారు.

## టీవీ అశోక్‌కు గురుబ్రహ్మ ఎక్సలెన్సీ అవార్డు

ఖిలావరంగల్, అక్టోబర్ 1: మహబూబియా ఉన్నత పాఠశాలకు చెందిన ఉపాధ్యాయుడు టీవీ అశోక్ వరల్డ్ టీచర్స్ డే వేడుకల్లో భాగంగా హైదరాబాద్‌లో ఆదివారం గురుబ్రహ్మ ఎక్సలెన్సీ అవార్డు అందుకున్నాడు. రిటైర్డ్ అసిస్టెంట్ కమిషన్ డాక్టర్ సీహెచ్ శ్రీనివాస్ చేతులమీదుగా అతడు అవార్డు స్వీకరించారు. తాను ఉపాధ్యాయ రంగంతోపాటు కళా, సామాజిక రంగాల్లో కృషి చేసినందుకు ఈ అవార్డు వచ్చిందని అశోక్ తెలిపారు.



అవార్డును అందుకుంటున్న టీవీ అశోక్

# 'వుషు' పోటీలకు క్రీడాకారుల ఎంపిక



క్రీడా పోటీలను ప్రారంభిస్తున్న చిప్ప వెంకటేశ్వర్లు

పోచమ్మమైదాన్, అక్టోబర్ 1: స్కూల్ గేమ్ ఫెడరేషన్ క్రీడల్లో భాగంగా నిర్వహించిన జిల్లాస్థాయి వుషు పోటీలకు ఆదివారం క్రీడాకారులను ఎంపిక చేశారు. ఫెడరేషన్ ఆర్గనైజింగ్ సెక్రటరీ ఐలయ్య, సెక్రటరీ ఎస్‌డీ యాకూబ్ ఆధ్వర్యంలో కొత్తవాడలోని సన్‌ఫ్లవర్ హైస్కూల్ ఆవరణలో అండర్-17 విభాగంలో బాలబాలికలను ఎంపిక చేశారు. ప్రతిభ కనపరిచిన క్రీడాకారులను ఎంపిక చేసి రాష్ట్రస్థాయి పోటీలకు పంపనున్నారు. ఈ సందర్భంగా 40 కేజీల విభాగంలో మహ్మద్ సనా, 35 కేజీల విభాగంలో ఎం.మనోజ్ఞ, 45 కేజీలో విభాగంలో బూర హర్షవర్ధన్ రాష్ట్రస్థాయికి ఎంపికైనట్లు నిర్వాహకులు తెలిపారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ నాయకుడు చిప్ప వెంకటేశ్వర్లు, ఉషు అధ్యక్షుడు ఆర్.కోటేశ్వర్, బీఆర్‌ఎస్ డివిజన్ అధ్యక్షుడు బొల్లు సతీష్, టీ మురళి, స్కూల్ కరస్పాండెంట్ సయ్యద్ సమీర్ అహ్మద్, ఆర్గనైజింగ్ సెక్రటరీ ఎండీ అన్వర్, జాయింట్ సెక్రటరీ ఎం కిశోర్‌కుమార్ పాల్గొన్నారు.


# 'గృహలక్ష్మి'తో నిరుపేదల సొంతింటి కల సాకారం



ఇంటి నిర్మాణ పనులను ప్రారంభిస్తున్న సర్పంచ్, ఎంపీటీసీలు

నర్సంపేటరూరల్/నర్సంపేట, అక్టోబర్ 1: గృహలక్ష్మి పథకంతో నిరుపేదల సొంతింటి కల సాకారం అవుతున్నదని చంద్రయ్యపల్లి సర్పంచ్ బరిగెల లావణ్య, ఎంపీటీసీ పెద్ది శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. చంద్రయ్యపల్లిలో గృహలక్ష్మి పథకంలో మంజూరైన పలు ఇంటి నిర్మాణ పనులకు ముగ్గు పోసి, కొబ్బరికాయలు కొట్టి పనులు ప్రారంభించారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ గ్రామ అధ్యక్షుడు జర్పుల వీరన్న, ఉపాధ్యక్షుడు బరిగెల నవీన్, ప్రధాన కార్యదర్శి మామిడి ఐలయ్య, మాజీ సర్పంచ్ సముద్రాల సమ్మయ్య, వార్డు సభ్యుడు రాజు, మాజీ ఎంపీటీసీ భాషబోయిన సునీత-రాజు, నాయకులు పెద్ది తిరుపతిరెడ్డి, బరిగెల కిశోర్‌కుమార్, వీ తిరుపతిరెడ్డి, బీ రాంబాబు పాల్గొన్నారు. అలాగే, నర్సంపేట ఒకటో వార్డులో ఇంటి నిర్మాణ పనులను కౌన్సిలర్ దేవోజు తిరుమలా సదానందం ప్రారంభించారు. విడుతలవారీగా అందరికీ ఇండ్లు వస్తాయన్నారు. కార్యక్రమంలో కొల్లపురం రాజేశ్, నిరంజన్, అఫ్జల్, రమేశ్, సతీశ్, శ్రీను, సాయి, కుమార్, మధు, సాయి, కుమార్, వినయ్, హేమంత్ పాల్గొన్నారు.

# ఐలయ్య సేవలు మరువలేనివి: ఎంపీపీ



విగ్రహాన్ని ఆవిష్కరిస్తున్న నాయకులు

ఖానాపురం, అక్టోబర్ 1: బీఆర్‌ఎస్ నాయకుడు, సొసైటీ మాజీ చైర్మన్ దివంగత ముద్దంగుల ఐలయ్య సేవలు మరువలేనివని ఓడీసీఎంఎస్ చైర్మన్ రామస్వామీనాయక్, ఎంపీపీ వేములపల్లి ప్రకాశ్‌రావు అన్నారు. బీఆర్‌ఎస్ ఆధ్వర్యంలో అశోక్‌నగర్‌లో ఏర్పాటు చేసిన ముద్దంగుల ఐలయ్య విగ్రహాన్ని ఆదివారం వారు ఆవిష్కరించారు. అనంతరం వారు మాట్లాడుతూ గ్రామంలో బీఆర్‌ఎస్ బలోపేతానికి ఐలయ్య ఎంతో కృషి చేశారని కొనియాడారు. ఐలయ్య స్ఫూర్తిగా నాయకులు పార్టీ పటిష్టతకు కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ బత్తిని శ్రీనివాస్‌గౌడ్, బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు మహాలక్ష్మి వెంకటనర్సయ్య, వైస్ ఎంపీపీ ఉమరాణి, ఉపేందర్‌రెడ్డి, సర్పంచ్ కవిత, మండల ప్రధాన కార్యదర్శి బండి వెంకన్న, గ్రామ అధ్యక్షుడు యాదగిరిరావు, సంపత్, రాజుయాదవ్, తిరుపతిరెడ్డి, నాగేశ్వర్‌రావు, దేవేందర్‌రావు పాల్గొన్నారు.